సాక్షి
తిరుపతి
మంగళవారం ၊ 14 ၊ జనవరి ၊ 2025



పండగ పూట పెను విషాదం

పంటగపూట పెను విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో సైదాపురం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. - 8లో



శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా నారావారిపల్లెకు విచ్చేసిన సీఎం చంద్రబాబు పలు శంకుస్థాపనలు చేశారు. - 8లో



ఎంబీయూలో సంక్రాంతి సంబరాలు

ఎంబీయూ వర్సిటీలో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. చాన్స్‌లర్ మోహన్‌బాబు, ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు పాల్గొన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఎగసి పడుతున్న అలలు



తూపిలిపాళెం వద్ద ఎగసిపడుతున్న అలలు

వాకాడు:వాతావరణంలో అనూహ్యంగా చోటు చేసుకున్న మార్పుల కారణంగా సోమవారం సముద్ర తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. వాకాడు మండలం, తూపిలిపాళెం సముద్ర తీరంలో అలలు ఐదు మీటర్ల ఎత్తు వరకు ఎగసి పడుతున్నాయి. అలాగే తీర ప్రాంతంలో ఓ మోస్తారు వర్షం పడుతోంది. మరో పక్క చలి గాలులు వీస్తున్నాయి. మత్స్యకారులు చలిగాలులకు గడప దాటలేని పరిస్థితి ఏర్పడింది.

ఘనంగా కవి సమ్మేళనం



తీగల వెంకటయ్యను సన్మానిస్తున్న కవులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి ఆధ్వర్యలో సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహించారు. పలువురు కవులు స్వీయ కవితలు వినిపించారు. అనంతరం ఎంఈవో-2 తీగల వెంకటయ్యను ఘనంగా సన్మానించారు.

నేడు స్విమ్స్ ఓపీకి సెలవు

తిరుపతి తుడా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్విమ్స్‌లోని ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. అత్యవసర సేవలు యథాతథంగా కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: 2025-2026 విద్యా సంవత్సరానికి ఎంపిక పరీక్ష ద్వారా 6, 9 తరగతులకు బాల బాలికలకు అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో జరగనున్న సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు 23 జనవరి వరకు పొడిగించినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు వయసును బట్టి 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు చక్కటి అవకాశం ఉందన్నారు. మరిని వివరాల కోసం 86888 88802 / 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

నగుబాటే!

'రాష్ట్రంలో రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. వర్షమొస్తే ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ బాగుందో తెలియని పరిస్థితి నెలకొంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల పనులు మొదలు పెడతాం. సంక్రాంతి నాటికి అద్దాల్లాంటి రోడ్లు నిర్మిస్తాం. మీ ఊర్లకొచ్చే బంధువులు వాటిని చూసి ఆశ్చర్యపోయేలా చేస్తాం..' అంటూ ఊదరగొట్టిన సీఎం చంద్రబాబునాయుడు ఆచరణలో చతికిల పడ్డారు. జిల్లాలో 1,666 పనులు మంజూరు చేయగా.. అందులో సంక్రాంతి నాటికి కనీసం 40 శాతం కూడా పూర్తిచేయించలేకపోయారు. ఎక్కడ రోడ్లు అక్కడే వదిలేశారు. గుంతల్లో ప్రయాణించకలేక వాహనదారులు, పాదచారులు నానా ఇక్కట్లపాలవుతున్నారు.



ఏర్పేడు మండలంలోని టీసీఎల్ కంపెనీ మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంపై ఏర్పడిన భారీ గుంతలు

పండగ హామీ హుళక్కే

- సంక్రాంతి కల్లా రోడ్లు పూర్తిచేస్తామన్న కూటమి ప్రభుత్వం
- హామీని నిలబెట్టుకోలేక పోయిన పాలకులు
- జిల్లాలో తూతూమంత్రంగా రోడ్ల పనులు
- రోడ్లెక్కడంటూ నేతలను నిలదీస్తున్న స్థానికులు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా పల్లె పండగ పేరుతో తొలి దశలో 1,666 పనులు గుర్తించారు. వీటి కోసం రూ.108.35 కోట్ల వరకు మంజూరు చేశారు. రెండో దశలో 59 పనులకు రూ.21.76 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా ఇప్పటి వరకు 1,725 పనులకు రూ.130.11 కోట్లు మంజూరయ్యాయి. బిల్లులు చెల్లిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆమేరకు పనులు జరగకపోవడంతో గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా 40 శాతానికి మించి పూర్తికాకపోవడంతో నిట్టూర్పులు వెళ్లగక్కుతున్నారు.

అధ్వాన్నంగా నెలబల్లి-రెట్టపల్లి రోడ్డు

గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలంలో ప్రధాన రహదారి వరగలి క్రాస్ రోడ్డు నుంచి గమ్మళ దిబ్బ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీని మరమ్మతులకు ఎన్నికలకు ముందు రూ.80 లక్షల వరకు విడుదల చేశారు. అయినా పనులు మొదలు పెట్టలేదు. అటు తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గంతలు లేని రోడ్లను సంక్రాంతిలోగా వేస్తామని మాటిచ్చింది.

బాగుచేసే వారి కోసం ఎదురుచూపులు

వెంకటగిరి-గూడూరు రోడ్లుతోపాటు వెంకటగిరి -డక్కిలి-బాలాయపల్లి రోడ్లు అధ్వాన్నంగా మారాయి. వెంకటగిరి- గూడూరు మార్గంలోని బంగారుపేట బీసీ కాలనీ వద్ద గుంతలు అలానే ఉన్నాయి. ఈ మార్గంగుండా రాకపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



గుంతల మయంగా ఉన్న వెంకటగిరి-గూడూరు, బంగారుపేట బీసీ కాలనీ రోడ్డు

పెద్ద పాండూరులో పెద్ద పెద్ద గుంతలు



పెద్దపాండూరు రోడ్డు దుస్థితి

సత్యవేడు నియోజకవర్గంలోని పెద్దపాండూరు రోడ్డు అధ్వాన్నంగా మారింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ఆ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు నరకం చూడాల్సి వస్తోంది. ప్రధానంగా చెన్నావారిపాళెం, వెంగారెడ్డి కండ్రిగ, పొంగంబట్టు, ఎంజీ నగర్, అంబికాపురం, శిద్దేశ్వరపురం, నాగనందాపురం తదితర 14 గ్రామాలకు వెళ్లాల్సి ఈ రోడ్డుపై ఆర్టీసీ సర్వీసులతోపాటు ప్రైవేటు వాహనాలు వందల సంఖ్యలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. అయినా అధికారులు ఆ మార్గంలోని రోడ్లను మరమ్మతులు చేయలేదు.

ఈ క్రమంలోనే స్థానిక ఎమ్మెల్యే గతంలో విడుదలైన నిధులతో గంతలు పూడ్చే పనులను నవంబర్‌లో మొదలు పెట్టారు. అయితే అవి నేటికీ పూర్తికాలేదు. అలాగే కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోనూ రోడ్లు దుస్థితికి చేరాయి. గూడూరు నుంచి తిప్పవరప్పాడు గ్రామం వరకు రాపూరు, గూడూరు రోడ్డును మరమ్మతులు చేశారు. దీనికిగాను రూ.65 లక్షలు విడుదల చేశారు. పనులు నాసిరకంగా చేయడంతో అప్పుడే గుంతలు ఏర్పడ్డాయి.

చిన్నగొట్టిగల్లు రోడ్డు సొగసు చూడతరమా?

చిన్నగొట్టిగల్లు రోడ్డు అధ్వానంగా మారింది. చిన్నగొట్టిగల్లు మండల కేంద్రం నుంచి చెరువు ముందరపల్లెకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.





గుంతలమయంగా పాపానాయుడుపేట వయా ప్రధాన రోడ్డు మార్గం



మర్రిమంద నుంచి పాపా నాయుడుపేట మార్గం ఇలా..



చిన్నగొట్టిగల్లు నుంచి చెరువుముందరపల్లెకు వెళ్లే రోడ్డు

జిల్లాలో పల్లె పండుగ రోడ్ల తొలి దశ

మొత్తం పనులు	1,666
మంజూరైన నిధులు	రూ.108.35 కోట్లు
వేయాల్సి రోడ్లు	1,85,795.26 మీటర్లు
సీసీ రోడ్లు మొత్తం	1,622
మంజూరైన నిధులు	రూ.90.75 కోట్లు
నిర్మించాల్సింది	1,60,705 మీటర్లు
బీటీ రోడ్లు	07
మంజూరైన నిధులు	రూ.14.14 కోట్లు
నిర్మించాల్సింది	23,516 మీటర్లు
డబ్ల్యూబీఎం రోడ్డు	05
మంజూరైన నిధులు	రూ.49.85 లక్షలు
నిర్మించాల్సింది	2,054 మీటర్లు
కాంపౌండ్ వాల్స్ పనులు	17
మంజూరైన నిధులు	రూ.146.20 లక్షలు
నిర్మించాల్సింది	1,462 మీటర్లు

రెండో దశలో 59 పనులకు రూ.21.76 కోట్లు

599 రోడ్లు పూర్తి



ఇప్పటి వరకు జిల్లాలో పల్లెపండుగ రోడ్లకు సంబంధించి తొలి దశలోని 1,666 రోడ్లలో 599 రోడ్లు పూర్తిచేశాం. రెండో దశ రోడ్లు ఉన్నాయి. సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేశాం. అయితే కొన్ని రోడ్లు ఆలస్యంగా మంజూరు చేశారు. దీంతో జాప్యం చోటుచేసుకుంది. మార్చి 31వ తేదీ లోపు వంద శాతం రోడ్లు పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నాం. ఆమేరకు కాంట్రాక్టర్లకు ఆదేశాలిచ్చాం.

-రామ్మోహన్, పంచాయతీ రాజ్ జిల్లా అధికారి

బిల్లుల్లో జాప్యం లేదు



బిల్లులు మంజూరు చేయడంలో జాప్యం లేకుండా చర్యలు చేపడుతున్నాం. జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో జిల్లాలో పల్లె పండుగ పేరుతో రెండో దశలో 1,725 పనులు కేటాయించాం. వీటికి రూ.130.11 కోట్ల నిధులు మంజూరు చేశారు. 40 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన రోడ్లు పెండింగ్‌లో ఉన్నాయి.

- శ్రీనివాస ప్రసాద్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

కదిలిస్తే కన్నీళ్లే!

వైకుంఠ ద్వారం గుండా ఆ కలియుగ వేంకటేశ్వరుడిని దర్శించి పునీతులవ్వాలని తరలి వచ్చారు. కానీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. వారి జ్ఞాపకాలు తలుచుకుని బంధువులు నేటికీ కన్నీటి పర్యంతమవుతున్నారు.

- దిక్కు తోచని స్థితిలో కుమిలిపోతున్నాం
- కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి
- జీవితాంతం ఆ లోటు వెంటాడుతూనే ఉంటుంది
- వైకుంఠ ఏకాదశి టోకన్ల తొక్కిసలాటలో మృతి చెందిన బంధువుల ఆవేదన

తిరుపతి టాస్క్‌ఫోర్స్: వారిని కదిలిస్తే చాలు.. కన్నీళ్లే సమాధానం చెబుతున్నాయి. తోడుగా ఉన్నవారు దూరమవడంతో దిక్కుతోచని స్థితిలో కుమిలిపోతున్నారు. తల్లిలేని ఆడబిడ్డల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఆ ఘటన నుంచి తేరుకోలేక పోతున్నామని, ఆ జ్ఞాపకాలు తలుచుకుని మంచానికే పరిమితమయ్యామని మృతుల కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. వైకుంఠ ఏకాదశి ద్వార దర్శన టోకన్ల జారీ సందర్భంగా తిరుపతి బైరాగిపట్టెడ, శ్రీనివాసం కౌంటర్లలో ఈనెల 8వ తేదీన జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతిచెందిన విషయం తెల్సిందే. అందులో నలుగురు ఏపీకి చెందిన వారు కాగా ఒకరు తమిళనాడు, మరొకరు కేరళకు చెందిన భక్తులు ఉన్నారు. ఘటన జరిగి సుమారు ఆరు రోజులు కావస్తున్నా మరణించిన బక్తుల రక్తసంబంధీకులు, బంధువులు ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నారు. కొందరు మంచానికే పరిమితమయ్యామని, జీవితాంతం ఆ లోటు వెంటాడుతూనే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తిరుపతిలో టిక్కెట్ల జారీ కేంద్రం వద్ద తోపులాట (ఫైల్)

- వైజాగ్ చెందిన మృతురాలు లావణ్య కుటుంబ పరిస్థితి దారుణంగా ఉంది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. తల్లి దూరమైన ఆ పసిపిల్లల ఆవేదన వర్ణనాతీతం. తల్లి లేని జీవితాన్ని ఊహించుకోలేమంటూ ఆవేదన చెందుతున్నారు. వారిని బంధువులు ఓదార్చలేని పరిస్థితి.

ఆయన జ్ఞాపకాలతో కుమిలిపోతున్నా



వైకుంఠ వాకిలి ద్వారా స్వామి వారి దర్శనం చేసుకోవాలనే తపనతో నా భర్త నాయుడుబాబుతో కలసి 8వ తేదీన తిరుపతికి వచ్చాం. అదే రోజు జరిగిన తొక్కిసలాటలో నా భర్త చనిపోయాడు. కూలి చేసుకుంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్న మా కుటుంబంలో ఈ విషాదం భారీ నష్టాన్ని మిగిల్చింది. నా భర్త వెంట లేడనే బాధను దిగమింగుకోలేక పోతున్నా. కుటుంబంలో 90 ఏళ్ల పెద్దవారు ఉన్నారు. వారి బాగోగులు చూసుకోవాలి. ఆయన తోడు విడిచాడు. నా పరిస్థితి తలచుకుంటేనే భయమేస్తోంది. ప్రభుత్వం సాయం అందించారు. నేను పెద్దగా చదువుకున్న దానిని కాదు. అధికారులు ఉద్యోగం నర్సీపట్నంలోనే కల్పిస్తే నాకు కాస్త వెసులుబాటుగా ఉంటుంది.

- మణికుమారి, మృతుడు నాయుడుబాబు సతీమణి, నర్సీపట్నం

మా ఇంటి మహాలక్ష్మి వెళ్లిపోయింది



మాది వైజాగ్ దగ్గర మద్దెలపాళెం. నేను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. మాకు ఒక్కడే కుమారుడు. కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనానికి వెళ్లాం. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో నా భార్య రజిని మరణించారు. మా ఇంటి మహాలక్ష్మి మాకు దూరమైంది. ఇంట్లో నేను, నా కుమారుడు ఇద్దరమే మిగిలాం. ప్రతి క్షణం ఆమె జ్ఞాపకాలు వెంటాడుతున్నాయి. గత ఏడాది సంక్రాంతి సంతోషంగా గడిపాం. ఈ ఏడాది ఆమెను దేవుడు దూరం చేశాడు. మా అబ్బాయి విదేశాలకు వెళ్లి చదువుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఇలాంటి దుర్ఘటన చోటు చేసుకోవడం జీర్ణించుకోలేకపోతున్నాం. -లక్ష్మణరెడ్డి, మృతురాలి భర్త, మద్దెలపాళెం, వైజాగ్

తల్లిని కోల్పోయా

మాది కేరళ. ఈనెల 8వ తేదీన వైకుంఠ ఏకాదశి టోకన్ల కోసం తిరుపతి కౌంటర్లలో జరిగిన తొక్కిసలాటలో మా తల్లి నిర్మల చనిపోయారు. ఆ విషాదం నుంచి తేరుకోలేకున్నాం. మా తల్లి నా కళ్ల ఎదుటే తిరుగుతున్నట్లు ఉంది. మా కుటుంబానికి ఆమే పెద్ద దిక్కు. అలాంటిది తల్లి లేకపోవడం కలచివేస్తోంది. ఏ జన్మలో పాపం చేశానో తల్లిని పోగొట్టుకున్నాను. జీర్ణించుకోలేని పరిస్థితి.

-కౌషిగ, మృతురాలు నిర్మల కుమార్తె, కేరళ

అమ్మ జ్ఞాపకాలతో

ఊహించని ఘటనతో కుటుంబం అంతా షాక్‌లోనే ఉంది. దైవదర్శనానికి వెళితే ఇలా జరగడం మనసును కలచివేస్తోంది. అమ్మ జ్ఞాపకాలు ప్రతి క్షణం వెంటాడుతున్నాయి. గత ఏడాది సంక్రాంతి అమ్మతో కలసి సంతోషంగా గడుపుకున్నాం. ఇప్పుడు నాన్నతో పాటు యావత్ కుటుంబం, బంధువులు విషాదంలో మునిగిపోయి ఉన్నాం. జ్వరాలతో మంచాన పడ్డాం. - మహేష్, మృతురాలు శాంతి కుమారుడు, వైజాగ్

కోలుకోలేకపోతున్నా



తొక్కిసలాటలో చనిపోయిన మల్లిక నా సతీమణి. మాది తమిళనాడు, సేలం జిల్లా మెట్టూరు. ఆ రోజు భార్య, మా బంధువలతో కలసి ద్వార దర్శన టోకన్ల కోసం వెళ్లాం. దురదృష్టవశాత్తు తొక్కిసలాటలో నా భార్యను కోల్పోయాను. ఆమె మరణం మా కుంటుంలో పెను విషాదాన్ని నింపింది. ఆ బాధతో మంచానికే పరిమితమయ్యాం. ఘటన జరిగిన స్థితి నుంచి కోలుకోవడం కష్టంగా ఉంది. ప్రతి కదలికలోనూ ఆమె గుర్తుకొస్తోంది. - క్రిష్ణన్, మృతురాలు మల్లిక భర్త, మెట్టూరు, శేలం, తమిళనాడు

టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్‌తో స్విమ్స్ ఎంవోయూ



ఒప్పంద పత్రాలతో స్విమ్స్, టాటా క్యాన్సర్ ఆస్పత్రుల డైరెక్టర్లు

తిరుపతి తుడా: టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ హాస్పిటల్‌తో స్విమ్స్ ఆస్పత్రి అధికారులు పలు అంశాలపై ఎంవోయూ చేసుకున్నారు. స్విమ్స్‌లో సోమవానం స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్, టాటా క్యాన్సర్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ పి.ప్రశాంత్ ఒప్పందపు పత్రాలపై సంతకాలు చేశారు. వారు మాట్లాడుతూ స్విమ్స్ ఇన్‌స్టిట్యూషనల్ ఎథిక్స్ కమిటీ మార్గదర్శకత్వంలో స్వీకార్ వద్ద నిర్వహించే క్లినికల్ పరిశోధనలకు సహకారాలు అందిపుచ్చుకోనున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం రెండేళ్లు కొనసాగుతుందని, ఎన్నో పరిశోధనలకు అవకాశం ఉంటుందన్నారు.

కరెంట్ మంటలు









సీఎం చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీలను పెంచడం వల్ల రాష్ట్రంలో రేగిన ప్రజాగ్రహ జ్వాలలు చల్లారడం లేదు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ తిరుపతి స్విమ్స్ సర్కిల్‌లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. - తిరుపతి రూరల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ కమిటీలో పలువురికి చోటు

సాక్షి, తిరుపతి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కమిటీలో చిత్తూరు, తిరుపతి జిల్లా వాసులకు చోటు కల్పిస్తూ సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది.
మున్సిపల్ విభాగం: ఉపాధ్యక్షుడిగా ఆర్.వెంకటేశులు
ప్రధాన కార్యదర్శిగా : హరిణిరెడ్డి
కార్యదర్శిగా : సాయిక్ మహ్మద్ జాఫర్
అఫిషియల్ స్పోక్ పర్సన్‌గా : ఖైజేర్‌ఖాన్
సంయుక్త కార్యదర్శులుగా : ఎస్‌డీ హఫీజ్, గుణశేఖర్‌ను నియమించినట్లు పేర్కొంది.

అనుబంధ విభాగం..

రాష్ట్ర మున్సిపల్ విభాగంతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల అనుబంధ విభాగాల అధ్యక్షులను కూడా ప్రకటించింది.
యూత్ విభాగం : ఉదయ్‌వంశీ(తిరుపతి)
మహిళ విభాగం : బొర్రా మాధవి(సత్యవేడు)
రైతు విభాగం : చంద్రమౌళిరెడ్డి(చంద్రగిరి)
బీసీ విభాగం : సుబ్రమణ్యం అలియాస్ చిన్ని యాదవ్ (చంద్రగిరి)
ఎస్సీ విభాగం : తలారి రాజేంద్ర(తిరుపతి)
ఎస్టీ విభాగం : దశ సుబ్రమణ్యం(శ్రీకాళహస్తి)
మైనారిటీ విభాగం : ఎస్‌కే ఖాదర్ (పుంగనూరు)
విద్యార్థి విభాగం : చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి (చంద్రగిరి)
క్రిస్టియన్ మైనారిటీ విభాగం : రూబెన్(పలమనేరు)
పంచాయతీరాజ్ : కే.మనోహర్(పూతలపట్టు)
ఆర్‌టీఐ విభాగం : కొత్తపల్లి విజయకుమార్(తిరుపతి)
ఐటీ విభాగం : నలి ప్రకాష్ రెడ్డి (పుంగనూరు)
వలంటీర్ల విభాగం : కేతు ఢిల్లీబాబు(శ్రీకాళహస్తి)
మున్సిపల్ విభాగం : ఎస్‌డీ హఫీజ్(కుప్పం)
గ్రీవెన్స్ విభాగం : మోహన్‌నాయక్ (కుప్పం)
వాణిజ్య విభాగం: బి.హేమసుందర్‌రెడ్డి(జీడీనెల్లూరు)
వైద్య విభాగం : జెల్లి వర వరప్రసాద్(తిరుపతి)
ఇంటలెక్చువల్ ఫోరం : గిరిధర్‌రెడ్డి (చిత్తూరు)
వైఎస్సార్‌టీయూసీకి : సాయిక్ చంద్ బాషా (చిత్తూరు)
వీవర్స్ విభాగం : బాలక్రిష్ణన్ (నగరి)
సాంస్కృతిక విభాగం : కొండూరు శాస్త్రిరాజు (సత్యవేడు)
దివ్యాంగుల విభాగం : కోనాత్తం చంద్రశేఖర్ (పూతలపట్టు)
సోషల్ మీడియా విభాగం : వెల్లూరు రాకేష్ (సత్యవేడు)
పబ్లిసిటీ విభాగం : సుబ్రమణ్యం(జీడీనెల్లూరు)
బూత్ కమిటీ : ఎన్ వెంకటేష్‌రెడ్డి (జీడీనెల్లూరు)
అంగన్‌వాడీ విభాగం అధ్యక్షులుగా కొండవారి కుమారి(తిరుపతి)ని నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటనలో పేర్కొంది.



సంక్రాంతికే సందడి

మాది బళ్లారి. తాత ముత్తాతల నుంచి మా వృత్తి గంగిరెద్దులను ఆడించుకుంటూ జీవనం సాగించే వాళ్లం. ప్రస్తుతం ఆదరణ తగ్గడంతో గంగిరెద్దుల ఆటలు మూలన పడ్డాయి. కేవలం సంక్రాంతి మూడు రోజులు మాత్రమే ఆటలు ఆడించుకుంటాం. కేవలం పశువులను ముస్తాబు చేసి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లి భిక్షాటన చేస్తున్నాం. అయినా కుటుంబ జీవనం సాగడం లేదు. మూడు రోజుల తర్వాతా సొంతూళ్లకు వెళ్లి పనికి, కంచె అల్లడం వంటి పనులకు పోతూ వచ్చిన కూలీతో జీవనం గడుపుతున్నాం

– మొరం వీరన్న, గంగిరెద్దుల కళాకారుడు

ఆట ఆగింది.. భిక్షాటన మిగిలింది!

పొద్దున్నే పీపీపీ..అంటూ సన్నాయి ఊదుతూ 'తల్లీ పండగ పూట బసవన్న మీ ఇంటి గుమ్మం తొక్కాడు' అంటూ గంగిరెద్దుల కళాకారులు ప్రధానంగా సంక్రాంతి రోజున గ్రామీణ, పట్టణ పురవీధుల్లో సందడి చేస్తుంటారు. 'డూడూ బసవన్నా... అదిగో ఆ ఇంటి మహాలక్ష్మి నీకోసం పట్టెడు భత్యం, నా కోసం ఓ అంగీ తెచ్చింది..ఇంటిల్లిపాదినీ సల్లంగుండాలని మనసారా దీవించు గోమాతా..' అంటూ సన్నాయిలో పాట పాడుతుంటే బసవన్న తలూపుతూ దీవించడం మొదలు పెడుతుంది. ఇలాంటి తీపి గుర్తులు ఇక కనబడవంటే నమ్మడం కష్టంగా ఉంది కదూ..! అదే ఎందుకు.. ఏమిటో మీరే చదవండి.

- సంక్రాంతి సందడిలో గంగిరెద్దులదే ప్రధాన ఆకర్షణ
- ఆదరించే వారులేక... ఆడించేవారు కనుమరుగు
- భిక్షాటనతో కడుపు నిండలేదంటున్న గంగిరెద్దుల కళాకారులు
- కానరాని దైవ జాతి పశువులు
- భవిష్యత్‌లో డూడూ బసవన్నలు కనబడవంటూ ఆవేదన

తిరుపతి సిటీ: గంగిరెద్దును ఆడించడం ఓ అరుదైన కళ. ఎద్దును మచ్చిక చేసుకుని తమవైపు తిప్పుకుని తమ పాటకు, మాటకు అనుగుణంగా ఆడించడం అతి ప్రమాదకరమైన, క్లిష్టమైన ప్రక్రియ. గంగిరెద్దులకు విద్య నేర్పించేందుకు ప్రత్యేక గురువులు ఉంటారు. సరైన పద్ధతిలో శిక్షణ ఇచ్చేందుకు సుమారు ఏడాది కాలం పడుతుంది. శిక్షణ ఇచ్చిన గురువులకు ఏడాదికి రూ.లక్ష వరకు చెల్లించాల్సి ఉంటుంది. పశువులు సైతం కరువవుతున్న ఆధునిక సమాజంలో దైవజాతి గోవులు దొరకడం దుర్లబంగా మారింది. శిక్షణనిచ్చే గురువుల తరం అంతరించింది. కళాకారులు ఆ వృత్తికి స్వస్తి పలికేశారు. కేవలం సాధారణ పశువులను అలంకరించుకుని సంక్రాంతి పండుగకు వలస వెళ్తున్నారు.

ఆ మూడు రోజుల పాటు భిక్షాటన

సంక్రాంతి పండుగ అంటే గుర్తుకొచ్చేది గంగిరెద్దుల విన్యాసాలు. అయితే ఇటీవల గంగిరెద్దుల కళాకారులు ఆ వృత్తికి దూరమవుతున్నారు. సంక్రాంతి సమయంలో తప్ప మిగిలిన రోజుల్లో ప్రజల నుంచి పెద్దగా ఆదరణ ఉండడం లేదు. గంగిరెద్దుల ఆటను, విన్యాసాలను తిలకించేందుకు నేటి తరం అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో కళాకారులు కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు మాత్రం వృత్తిని వదులుకోలేక కేవలం గంగిరెద్దు వేషంతో సాధారణ పశువులను అలంకరించి పట్టణ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణాల్లో ఇంటింటికీ తిరుగుతున్న బసవన్నలకు ఆట, పాట బోధపడదు.

భవిష్యత్‌లో కనిపించవా బసవన్నా!

సన్నాయి బూర, డోలు, చేతిలో కంచుతో చేసి చేగుంట, తలపై రంగురంగుల గుడ్డ, మూతిమీద కోర మీసాలు, చెవులకు కమ్మలు, చేతికి, కాళ్లకు వెండి కడియాలు, నుదుటున నామాలతో సంక్రాంతి పండగకు ఆకర్షణగా నిలిస్తున్న గంగిరెద్దుల కళాకారులు భవిష్యత్‌లో కనుమరుగు కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే గంగిరెద్దుల ఆట దాదాపు అంతరించిపోయింది. ప్రజలు ప్రాచీన సంప్రదాయలను విడనాడి ఆధునిక టెక్నాలజీ వైపు మొగ్గుచూపడం, గంగిరెద్దుల ప్రాధాన్యత యువతరానికి తెలయకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. రోజంతా భిక్షాటన చేసినా తమ కడుపులు నిండలేదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో డూడూ బసవన్న చరిత్రగా మిగిలిపోనుంది.

వేరే పనిచేతగాక..



మాది అనంతపురం జిల్లా. మా పెద్దలు గంగిరెద్దుల ఆటనే వృత్తిగా కొనసాగించారు. ప్రస్తుత సమాజంలో ఆ వృత్తికి ఆదరణ లేదు. బసవన్న ఆట ఆగిపోయింది. వేరే పనిచేతగాక పశువులను అలంకరించుకుని వలస వచ్చి భిక్షాటన చేస్తున్నాం. కనీసం రోజూ కుటుంబానికి సరిపడా భత్యం రావడం లేదు. అప్పట్లో బట్టలు, గోవుకు దానా, గోపూజ చేసి చేతికి పండుగ కానుకగా నగదు ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రతి ఇంటి గడపా తొక్కినా సాయంత్రానికి రూ.200 కూడా దొరకడం లేదు. మాకు ఇద్దరు చంటి పిల్లలు. మా భర్తతో పాటు నేను గోమాతతో భిక్షాటన చేసి పిల్లలను పోషిస్తున్నాం.

– కొళ్లాయమ్మ, గంగిరెద్దుతో భిక్షాటన చేస్తున్న మహిళ

గంగిరెద్దులకు ప్రత్యేక ఆకర్షణ ఉండేది



గంగిరెద్దుల ఆట, పాట అంటే గతంలో రాజులు తమ ఆస్థానంలో పండుగల రోజుల్లో ప్రత్యేకంగా గంగిరెద్దుల వాళ్లను పిలిచి పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులుగా భూములు, బంగారు ఆభరణాలు, జీవిత కాలం సరిపడా భత్యం అందించి ఆదుకునే వారు. దీంతో మా పెద్దలు ఈ వృత్తినే పిల్లలకు నేర్పించారు. 2001 సంవత్సరం వరకు కాస్తోకూస్తో గంగిరెద్దులకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆకర్షణ ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎటు చూసినా యాంత్రిక మయమైంది. గోవులను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఈ వృత్తి కేవలం సంక్రాంతి మూడు రోజులకే పరిమితమైపోయింది.

– ఆవుల వెంకన్న, భిక్షాటన చేస్తున్న కళాకారుడు

ఆదరణ కరువైంది



మాది బళ్లారి. ఇంట్లో అమ్మానాన్నతో కలిపి ఏడుగురు ఉన్నాం. అందరూ గంగిరెద్దుల కళాకారులే. కానీ ప్రయోజనం లేదు. అందరూ భిక్షాటన చేసిన రోజు గడవడం లేదు. గతంలో సంక్రాంతి పండుగకు ప్రధానంగా గ్రామాలలో తిరిగితే కనీసం ఆరు నెలలకు సరిపడా భత్యం అందేది. గంగిరెద్దుకు వరిగడ్డి, దాణా పెద్ద ఎత్తున అందేది. తమ సొంత పశువులతో సమానంగా చూసుకునేవారు. ప్రస్తుతం ఎన్ని గ్రామాలు, పట్టణాలు తిరిగినా గోమాత పోషణ రోజుకు సరిపడా దాణా అందడం లేదు. మా పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ప్రభుత్వాలు కళాకారులకు ఇచ్చే పింఛన్ వంటివి అందించి ఆదుకోవాలి

– రాములు, గంగిరెద్దుతో భిక్షాటన చేస్తున్న కళాకారుడు

ఇవి ప్రభుత్వ హత్యలు కావా?

- సీఎం తర్వాత సీఎం అని చెప్పుకునే నీకు సంబంధం లేదా?
- 194 కేసుతో దోషులను తప్పించే కుట్రలు
- పవన్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేసిన భూమన కరుణాకరరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : 'వైకుంఠ ఏకాదశి రోజున తిరుపతి టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తొక్కిసలాటలో ఆరుగురు చనిపోతే ఆ హత్యలు ప్రభుత్వం చేసినవి కావా పవన్‌కల్యాణ్..'? అంటూ వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ప్రశ్నించారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాటతో తమకు సంబంధం లేదన్న పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ తొక్కిసలాటలో ఆరుగురు మృత్యువాత పడి, యాభైమందికి పైగా క్షతగాత్రులైతే రాష్ట్రంలో ముఖ్యమంత్రి తర్వాత ముఖ్యమంత్రి అని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 'ఈ తొక్కిసలాటతో మాకు సంబంధం లేకపోయినా క్షమాపణ చెబుతున్నామని, దీనికి టీటీడీ పాలకమండలి మొత్తం కూడా క్షమాపణలు చెప్పాలని' చెప్పడంలోనే ఈ ప్రభుత్వానికి ప్రజలపై ఏపాటి శ్రద్ధ ఉందో తెలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల పాలనలో తిరుమలను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. మీ మధ్య సమన్వయ లోపం ఇట్టే కనిపిస్తోందన్నారు. తిరుపతి ఘటనకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో పాటు టీటీడీ ఈవో, అడిషనల్ ఈవో, పోలీసు అధికారులదే బాధ్యత అన్నారు. ఆరుగురు చనిపోతే 194 కేసు పెట్టడం హాస్యాస్పదమన్నారు. మీ నుంచి క్షమాపణలు కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడడం అంటే ఇదేనా పవన్‌కల్యాణ్ అని ఆయన ప్రశ్నించారు.

ఎంబీయూలో సంక్రాంతి సంబరాలు

- కుటుంబ సభ్యులతో కలసి భోగి మంటల్లో పాల్గొన్న మోహన్ బాబు, మంచు విష్ణు



మనవడు మంచు అవరాంతో కలసి భోగి మంటలు వేస్తున్న ఎంబీయూ చాన్స్‌లర్ మంచు మోహన్ బాబు



ఎంబీయూలోని సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న మోహన్‌బాబు వియ్యంకుడు, వైఎస్ సుధీకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

చంద్రగిరి: మండల పరిధిలోని ఏ.రంగంపేట సమీపంలోని ఎంబీయూ యూనివర్సిటీలో సోమవారం తెల్లవారుజామున చాన్స్‌లర్ మంచు మోహన్ బాబు, ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు కుటుంబ సభ్యులు భోగి సంబరాలు వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడుతూ అందరూ క్షేమంగా ఉంటే మనం క్షేమంగా ఉంటామన్నారు. భోగి పండుగ విశిష్టత గురించి అందరికీ తెలిసిందేనన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల నేటి యువత తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. సంస్కృతిని మర్చిపోకుండా తల్లితండ్రులు ఆత్మీయులు, స్నేహితులతో కలిసి సంక్రాంతి జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా సంక్రాంతి పండుగను మోహన్‌బాబు యూనివర్సిటీలో కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి జరుపుకుంటున్నామని మంచు విష్ణు అన్నారు. గత చేదు జ్ఞాపకాలను కాల్చేసి కొత్త ఆలోచనలతో సరికొత్తగా ముందుకు వెళ్లడానికి భోగిని జరుపుకుంటున్నామని తెలిపారు. తాను నటించిన భక్త కన్నప్ప చిత్రం ఏప్రిల్ 25వ తేదీన విడుదల కానుందని, అంతకముందు శ్రీకాళహస్తిలో ఈవెంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంచు విష్ణు తెలిపారు.

అధిక చార్జీలు వసూలు చేస్తున్న బస్సులపై దాడులు

- ఎనిమిది బస్సులపై కేసులు నమోదు
- 25 బస్సులకు రూ.3 లక్షల జరిమానా



తనిఖీ చేస్తున్న ఎంవీఐ స్వర్ణలత

తిరుపతి మంగళం : సంక్రాంతి పండుగకు వెళ్లే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు బస్సులపై సోమవారం తిరుపతి జిల్లా రవాణా శాఖాధికారులు దాడులు చేశారు. తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ ఆదేశాల మేరకు అధికారులు తిరుపతి జిల్లాలోని రేణిగుంట రోడ్డు ఆంజనేయపురం, నాయుడుపేట, గూడూరు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. అధిక చార్జీలు వసూలు చేస్తున్న బస్సులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 25 బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. వాటికి రూ.3 లక్షల జరిమానా విధించామన్నారు. ఈ నెల 19 వరకు తనిఖీలు చేస్తామన్నారు. మోటార్ వాహనాల తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, అతికనాజ్, మోహన్ కుమార్ ఆంజనేయ ప్రసాద్, స్వర్ణలత పాల్గొన్నారు.

రూ.84 లక్షలు ముంచిన సైబర్ నేరస్తులు

– పెళ్లి పేరుతో వల

తిరుపతి క్రైం : పెళ్లి పేరుతో వలవేసి.. రూ.84 లక్షలు సైబర్ మోసానికి పాల్పడిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన ప్రముఖ డాక్టర్ వివాహం చేసుకుని భార్యతో విడాకులు పొందాడు. అప్పటికే అతనికి 40 ఏళ్లు ఉండడంతో ఇంట్లో వారు పెళ్లికి తొందర పెట్టారు. దీంతో షాదీ మనీలో ప్రొఫైల్ పెట్టాడు. ఢిల్లీకి చెందిన తెలుగు అమ్మాయి అంటూ అందులో దీక్షారెడ్డి అనే అమ్మాయి పరిచయమైంది. తాను షేర్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేస్తున్నట్లుగా డాక్టర్‌ను నమ్మించింది. వెంటనే రెండు లింకులు పెట్టి, అకౌంట్ వివరాలు, ఆధార, పాన్ కార్డు వివరాలను ఎన్‌రోల్ చేయించింది. మొదటగా రూ.7 లక్షలు కట్టించుకుని రూ.20 లక్షలు అకౌంట్లో ఆదాయాన్ని చూపించింది. ఇలా తన వద్ద ఉన్న రూ.84 లక్షలను ఒకేసారి ఇన్వెస్ట్ చేయడంతో వెంటనే రూ.9 కోట్లు అకౌంట్లో చూపించింది. అందులో రూ.5 కోట్లు విత్‌డ్రా కోసం ప్రయత్నించగా అసలు విషయం బయటపడింది. దీంతో అతను అలిపిరి పోలీసులు సంప్రదించారు.

బాధ్యతగా డ్యూటీ చేద్దాం



మంగళం డీఎం పనితీరును తప్పుబడుతున్న డీపీటీవో నరసింహులు

తిరుపతి అర్బన్: డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్స్‌తోపాటు సిబ్బందికి డీఎంలు ఆదర్శంగా ఉండాలంటే బాధ్యతగా డ్యూటీలు చేయాలని డీపీటీవో నరసింహులు సూచించారు. రెండు రోజుల క్రితం డీపీటీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తొలి సమావేశంలో తిరుపతి, మంగళం, అలిపిరి డిపో మేనేజర్లతో సమీక్షించారు. ముందే మంగళం డిపోకు బస్టాండ్ లేదని.. ఈ క్రమంలో రాబడిని పెంచుకోవడానికి పలు సూచనలు చేస్తున్నా వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచి పద్ధతికాదని మంగళం డీఎం భాస్కర్‌పై ఆయన మండిపడ్డారు. అలాగే అలిపిరి డీఎం హరిబాబు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తిరుపతి డిపోలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రత్యేక ఫోకస్ పెట్టాలని డీఎం బాలాజీని ఆదేశించారు. రెండు రోజుల క్రితం శ్రీకాళహస్తి డిపోకు చెందిన అన్‌కాల్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విధుల నుంచి తొలగించిన విషయాన్ని గుర్తుచేశారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

- సీఎం చంద్రబాబు షెడ్యూల్ బిజీబిజీ



వృద్ధ దంపతుల వివరాలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

చంద్రగిరి: నారావారిపల్లికి చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. సంక్రాంతి సంబరాల అనంతరం స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రైతుల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపన, లబ్ధిదారులకు పలు సంక్షేమ కార్యక్రమాలకు చెందిన ఆస్తులను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా రైతులు బలరాం నాయుడు, జ్యోతికి డ్రిప్ పరికరాలను అందజేశారు. అనంతరం డ్రిప్ పరికరాల పంపిణీ వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. నారావారిపల్లిలో రూ.4.27 కోట్లతో నిర్మించనున్న 33/కేవీ సెమీ ఇండోర్ సబ్ స్టేషన్‌కు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఉపాధి హామీ పథకం కింద మూడు సచివాలయాల పరిధిలో 26 అభివృద్ధి పనులు రూ.3.21 కోట్ల పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎ.రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శ్రీసిటీ సౌజన్యంతో రూ.1.10 కోట్లతో స్టేట్ ఆఫ్ ఆర్ట్ కింద ఆదర్శవంతమైన పాఠశాలగా తీర్చిదిద్దనున్న పనులకు శంకుస్థాపన చేశారు. కందులవారిపల్లి పంచాయతీ పరిధిలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాన్ని కేర్ అండ్ గ్రో సామాజిక చైతన్య ప్రతినిధుల ద్వారా తిరుపతి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు అమలకు సంబంధించి సీఎం సమక్షంలో ఎంఓయూలను చేసుకున్నారు. నారావారిపల్లి సమీపంలోని ఐదు గ్రామాలలోని 200 మంది మామిడి రైతులతో ఎఫ్‌పీఓ ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఎస్సీ డ్వాక్రా సంఘాల మహిళలకు డీఆర్డీఏ - వెలుగు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సి.రామాపురం గ్రామాల్లోని మహిళలకు 15 ఈ-ఆటోలను రూ.1.5 లక్షల సబ్సిడీతో అందజేశారు. అనంతరం తన స్వగ్రామానికి చేరుకుని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

పెన్షన్ మంజూరు చేయండి బాబు

మాది చంద్రగిరి మండలంలోని భీమవరం గ్రామం. పక్షవాతంతో సుమారు ఐదేళ్లుగా బాధపడుతున్నా. నడవలేకపోతున్నా. దివ్యాంగ పింఛన్ ఇచ్చి ఆదుకోండయ్యా అంటూ వృద్ధ దంపతులు బీ.నాగరాజమ్మ, భర్త సుబ్బరామయ్య సీఎంను వేడుకున్నారు. వెంటనే దివ్యాంగ పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను సీఎం ఆదేశించారు.

పండగ పూట పెను విషాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శివశంకర్ నాయుడు, సుబ్బయ్యనాయుడు



సుబ్బయ్య ఇంటి ముందు బంధువులు(ఇన్‌సెట్) మృతి చెందిన సుబ్బయ్య (ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితుల మృతి
- పండగ పూట పాడె మోస్తున్నామంటూ గంగదేవిపల్లి గ్రామస్తుల ఆవేదన
- గుండెలవిసేలా రోదించిన బంధువులు, మిత్రులు

సైదాపురం: గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకునేందుకు నెల్లూరు నుంచి బయల్దేరిన ప్రాణస్నేహితులపై గుర్తుతెలియని వాహనం మృత్యువు రూపంలో వారి ప్రాణాల్ని మింగేసింది. మృతి చెందిన ఇద్దరూ సైదాపురం మండలం, గంగదేవిపల్లి గ్రామం కావడంతో ఆ గ్రామంలో తీరని విషాదం మిగిలింది. పండుగ వేళ పాడె మోయాల్సి వస్తోందంటూ స్థానికులు బోరున విలపించడం చూపరులకు కన్నీళ్లు తెప్పించింది. మృతులు ఇద్దరూ ప్రాణ స్నేహితులు కావడం విశేషం. స్థానికుల కథనం.. మండలంలోని గంగదేవిపల్లి గ్రామానికి చెందిన పాములూరు సుబ్బయ్యనాయుడు (36), బొల్లినేని శివశంకర్‌నాయుడు (36) నెల్లూరులోని హోటల్స్‌లో చెఫ్‌లుగా పనిచేస్తున్నారు. రెండుమూడు రోజులకోసారి స్వగ్రామంలో ఉన్న భార్య పిల్లలను చూసుకునేందుకు వస్తుండేవారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులుగా ఉండేవారు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి ఒకే బైక్‌పై నెల్లూరు నుంచి స్వగ్రామమైన గంగదేవిపల్లికి బయల్దేరారు. మనుబోలు వద్ద ఉన్న కాగితాలపూరు ధాబాకు వెళ్లి భోంచేసి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో హైవే దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో స్నేహితులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మనుబోలు పోలీసులు కేసును నమోదు చేశారు. మృతదేహాలను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తర్వాత అక్కడ నుంచి స్వగ్రామమైన గంగదేవిపల్లికి తీసుకెళ్లారు. మృతుడు శివశంకర్‌నాయుడుకు భార్య అనూష ఇద్దరు పిల్లున్నారు. అలాగే సుబ్బయ్యనాయుడుకు భార్య కల్పన ఇద్దరు పిల్లలు ఉన్నారు.